బోనం.. ఘనం



సచివాలయంలో బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. మహిళా ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కళాకారులు, చిన్నారుల నృత్యాలు, విన్యాసాలు అలరించాయి. సీఎస్ శాంతికుమారి నల్ల పోచమ్మకు బోనం సమర్పించారు.



రాష్ట్రపతి నిలయానికి పర్యాటక సంస్థ ఉచిత బస్సు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి శీతాకాల విడిది అయిన బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం సందర్శకుల కోసం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా ఉచిత షటిల్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. ఈ బస్సులను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. బేగంపేట యాత్రినివాస్ టూరిజం బుకింగ్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. యాత్రినివాస్, ప్యారడైజ్ మెట్రోస్టేషన్ నుంచి ప్రతిరోజూ ఉ.9 గంటల నుంచి సా.4 గంటల వరకు ప్రతి గంటకో బస్సు బయలుదేరుతుందని పర్యాటక సంస్థ అధికారులు తెలిపారు. వారాంతపు సెలవు రోజుల్లో అదనంగా సా.5గంటలకు, 6గంటలకు అదనంగా రెండు బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు..

నేటితో ముగియనున్న నిందితుల రిమాండ్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన నలుగురు నిందితులు.. మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు జ్యుడీషియల్ రిమాండ్ నేటితో ముగియనుంది. చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీలుగా ఉన్న వీరిని శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నారు. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, శ్రవణ్ విదేశాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కోర్టుకు ఏ ఆధారాలను/వివరాలను సమర్పిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

నేడు ఫైర్‌మన్ల పాసింగ్ అవుట్ పరేడ్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న 483 మంది ఫైర్‌మన్ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం వట్టినాగులపల్లిలోని తెలంగాణ విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ శిక్షణ కేంద్రంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం అగ్నిమాపక శాఖలో ఇటీవల ఎంపికైన 157 మంది డ్రైవర్ ఆపరేటర్లకు నియామక పత్రాలు అందజేస్తారు.

'పార్కుల రక్షణ, పచ్చదనం ప్రభుత్వ బాధ్యత'

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల కోసం పార్కులను రక్షించడం.. పచ్చదనం పెంపొందించడం ప్రభుత్వం, స్థానిక సంస్థల బాధ్యత అని హైకోర్టు స్పష్టం చేసింది. పార్కులను రక్షించడంతోపాటు ప్రజల హక్కులను కాపాడేలా గ్రీన్ స్పేస్ ఏర్పాటు చేయాలని కోరుతూ కే ప్రతాప్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్ దాఖలై ఎనిమిదేళ్లు అవుతున్నా అధికారులు ఎలాంటి వివరాలు సమర్పించలేదని గుర్తు చేసింది. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నామో కౌంటర్ దాఖలు చేస్తామని ఏఏజీ తెలపడంతో విచారణ ఆగస్టు 1కి వాయిదా పడింది.

ప్రతి నాలుగు జంటల్లో ఒకరికి సంతానలేమి

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి నాలుగు జంటల్లో ఒకరు సంతానలేమి సమస్య ఎదుర్కొంటున్నారని ఇన్‌ఫెర్టిలిటీ నిపుణులు వెల్లడించారు. ఈ సంఖ్య దాదాపు 1.5-2 కోట్ల మేర ఉండగా, తెలంగాణలో 15 శాతం జనాభా ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వివరించారు. వరల్డ్ ఐవీఎఫ్ డే సందర్భంగా గురువారం కింగ్‌కోఠి కామినేని ఫెర్టిలిటీ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వైద్యులు, సిబ్బందితోపాటు గతంలో ఐవీఎఫ్ విధానం ద్వారా పిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, వారి పిల్లలు కూడా పాల్గొన్నారు. సంతానసాఫల్య చికిత్సకు వెళ్లడాన్ని ఇప్పటికీ సమాజంలో అదేదో తప్పుగా భావిస్తున్నారని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు.

ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, అపరిశుభ్రత

- పార్ట్‌టైం మంత్రి పర్యవేక్షణ ఏది ? ● ఎక్స్‌లో కేటీఆర్

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరం సీజనల్ వ్యాధులకు నిలయంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 'పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. వెయ్యి స్వచ్ఛ ట్రాలీలు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో మేయర్, జీహెచ్ఎంసీ అధికారుల ఆకస్మిక పర్యటనలు చేయడం లేదు. చెత్త తరలింపు కాగితాలకే పరిమితమైంది. పర్యవేక్షించాల్సిన పార్ట్‌టైం మునిసిపల్ మంత్రి ఎమ్మెల్యేల కొనుగోలు, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారు' అని పరోక్షంగా సీఎం రేవంత్‌నుద్దేశించి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్ ఖాతాలో పలు విమర్శలు చేశారు.



రూ. 345.84 కోట్లు

మూడు కమిషనరేట్లకు బడ్జెట్ కేటాయింపులు

(5వ పేజీ తరువాయి)

ఈ బడ్జెట్‌లో కేటాయించారు.

- సాంకేతిక అవసరాలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు రూ. 18.45 కోట్లు
- సీసీఎస్ నిర్వహణకు రూ. 95 లక్షలు
- నేర పరిశోధన, క్రైమ్ డేటా విశ్లేషణకు రూ. 18.45కోట్లు
- స్పోర్ట్స్ మీట్‌కు అయ్యే ఖర్చు రూ.20 లక్షలు (గతంలో ఇది రూ.2.24 లక్షలు)
- పోలీస్ అమర వీరుల వారోత్సవాలకు రూ. 10 లక్షలు కేటాయించారు. (గతేడాది ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు)
- నూతన పోలీస్ స్టేషన్‌ల నిర్వహణకు రూ. 5 కోట్లు (గత ఏడాది రూ. 12.54 కోట్లు కేటాయించారు)

రాచకొండలో..

- కమిషనరేట్ నిర్వహణకు రూ. 9.40 కోట్లు
- కార్యాలయ నిర్వహణకు రూ. 7.46 కోట్లు
- ట్రాఫిక్ విభాగానికి రూ. 60 లక్షలు
- పండగల బందోబస్తుకు రూ. 75 లక్షలు
- సీసీఎస్, ఎస్‌వోటీ విభాగాలకు రూ. 5.50 లక్షలు
- మహిళా భద్రతకు రూ. 11.20 లక్షలు
- సీసీటీవీల నిర్వహణకు రూ. 25 లక్షలు
- స్పోర్ట్స్ మీట్‌కు రూ. 3.20 లక్షలు
- రాచకొండ కమిషనరేట్ భవన నిర్మాణానికి రూ. లక్ష

కొత్తగా ఏర్పాటైన పోలీస్ స్టేషన్‌ల నిర్వహణ, నిర్మాణం, మౌలిక సదుపాయాలకు బడ్జెట్ కేటాయించలేదు.

సైబరాబాద్‌లో..

- కమిషనరేట్ నిర్వహణకు రూ. 12.36 కోట్లు
- ట్రాఫిక్ విభాగానికి రూ. 2.65 కోట్లు
- పండగల బందోబస్తుకు రూ. 2.10 కోట్లు
- సీసీఎస్, ఎస్‌వోటీ విభాగాలకు రూ. 1.41 కోట్లు
- మహిళల భద్రతకు రూ. 33 లక్షలు
- స్పోర్ట్స్ మీట్‌కు రూ. 35 లక్షలు

కొంచెం ఇష్టం కొంచెం కష్టం

బడ్జెట్‌పై భిన్న స్వరాలు



(హయత్‌నగర్/చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత తొలిసారిగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకమైన బడ్జెట్ అని కొందరు కొనియాడుతుండగా, అంకెల గారడీ అని మరికొందరు పెదవి విరుస్తున్నారు. కులాల వారీగా కేటాయించిన బడ్జెట్‌పై ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

సంక్షేమాన్ని విస్మరించారు..



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో అన్ని సంక్షేమ శాఖలకు నిధుల కేటాయింపు తక్కువగా ఉంది. స్త్రీ శిశు సంక్షేమానికి కేవలం రూ. 2,736 కోట్లు మాత్రమే కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి రూ. 17వేల కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ. 3వేల కోట్లు, బీసీ సంక్షేమానికి రూ. 9200 కోట్లు, మాత్రమే కేటాయించారు. సుమారు రూ. 3లక్షల కోట్ల బడ్జెట్ కేవలం పది శాతం మాత్రమే ఈ శాఖలకు కేటాయింపులు చేశారు. రాష్ట్ర జనాభాలో సగ భాగం ఉన్న స్త్రీలకు సంక్షేమ శాఖలో తగిన ప్రాధాన్యత లేదు.

-చింతల ఇషాకర్, షేకీనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు రూ.1500 కోట్లు కేటాయించడం హర్షణీయం



మురికి కూపంగా మారిన మూసీని అన్ని విధాలుగా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1500ల కోట్లు కేటాయించడం హర్షణీయం. గత ప్రభుత్వం అరకొర కేటాయింపులు చేసి మూసీ అభివృద్ధిని పట్టించుకోలేదని, కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా పూర్తిస్థాయిలో నిధులను వెచ్చించి 53కిలోమీటర్ల మేర ఉన్న మూసీని ఇటు పర్యాటక కేంద్రంగా మరోవైపు ప్రజా రవాణాను మెరుగుపరచేలా మూసీకి ఇరువైపులా రోడ్లు, మెట్రో ప్రాజెక్ట్ నిర్మాణానికి రూపొందించిన ప్రణాళిక కార్యరూపం దాల్చేలా నిరంతరం సమీక్షలు జరపాలి.

- బీ.గంగాధర్‌రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 301 క్యాబినెట్ సెక్రెటరీ

ఎస్సీ సంక్షేమానికి రూ.33వేల కోట్లు కేటాయించడం అభినందనీయం



తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.33 వేల కోట్లను కేటాయించి వారి పట్ల ప్రభుత్వానికి ఉన్న నమ్మకాన్ని ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. అన్నిరంగాల్లో వెనుకబడిన ఎస్సీలను అభివృద్ధి చేయడంతోపాటు సంక్షేమం కోసం వేస్తున్న బాటలకు ఈ బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు అభినందనీయం.

- భువనగిరి చంద్రశేఖర్, నిరుపేదల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

ఐటీ, పారిశ్రామిక రంగాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సత్యాలకు దూరంగా ఉంది. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తగిన అవకాశాలపై దృష్టి సారించలేదు. కొన్ని రంగాలకు మాత్రమే అధిక ప్రాధాన్యతనిచ్చారు. నిరుద్యోగుల గురించి ప్రస్తావనే లేదు. విద్యా రంగానికి మరిన్ని నిధుల కేటాయింపు జరిపి ఉంటే బాగుండేది. ఐటీ రంగానికి తగిన ప్రాధాన్యత లేదు. కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సింది.

- ఎలే నర్సింహ, తెలంగాణ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

సబ్బండ వర్గాలకు ఉపయోగపడే బడ్జెట్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ఉంది. వ్యవసాయ రంగానికి ఎన్నడు లేనట్లుగా అధిక నిధుల కేటాయింపులు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్ని మరో సారి రుజువు చేసింది. ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు తగిన నిధుల కేటాయింపు చక్కగా ఉంది.

- దేవిడి వేణుగోపాల్‌రెడ్డి, సామాజిక కార్యకర్త

బాలాపూర్‌లో వైభవంగా బోనాల జాతర

- అమ్మవార్లకు బోనం సమర్పించిన మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గురువారం బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానికంగా గల అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ దీపాలతో, పచ్చని తోరణాలతో అలంకరించారు. తన సొంత గ్రామమైన బాలాపూర్‌లో బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి బోనంతో ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో సమర్పించారు. అదే గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, టీపీసీసీ నాయకుడు యెల్మేటి అమరేందర్‌రెడ్డి తదితరులు తమ కుటుంబ స భ్యులతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని బోనాలు సమర్పించారు. భక్తు లు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



బాలాపూర్‌లో బోనమెత్తిన మేయర్ పారిజాతారెడ్డి



మల్లాపూర్‌లో బోనాల ఉత్సవాల్లో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్

మల్లాపూర్‌లో..

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో గురువారం జరిగిన బోనాల ఉత్సవాల్లో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డితో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణం పూర్తి చేయాలి

- బీజేపీ నేతల డిమాండ్.. శిలాఫలకం వద్ద నిరసన

సరూర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు కాలనీల్లో వరద ముంపు నివారణకు చేపట్టిన ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణం పనులను అసంపూర్తిగా వదిలేయడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత వానాకాలంలో భారీ వర్షాలు కురిస్తే మళ్లీ ముంపు సమస్య తప్పదని వారు పేర్కొన్నారు. ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణం పూర్తి కాకపోవడానికి మునిసిపల్ పాలకుల వైఫల్యమే ప్రధాన కారణమని వారు ఆరోపించారు. నాలాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా గురువారం బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు నడికుడ యాదగిరి ఆధ్వర్యంలో ఇక్కడి డీపీఎస్ వద్ద గల శంకుస్థాపన శిలాఫలకం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండున్నరేళ్ల క్రితం అప్పటి మంత్రి కేటీఆర్ ఈ పనులకు శంకుస్థాపన చేయగా, నేటికీ పూర్తి కాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. నాలా నిర్మాణానికి భూసేకరణ సమస్య ఉంటే స్థానిక పాలకులు చొరవ తీసుకుని పరిష్కరించాల్సి ఉండగా ఆ దిశలో చర్యలు తీసుకోకపోవడంలోని ఆంతర్యమేమిటని వారు నిలదీశారు. బీజేపీ నాయకులు రేసు నర్సింహారెడ్డి, జీ.శశివర్ధన్‌రెడ్డి, లాలాసందీప్, సాయిసంతోష్, జీ.పవన్‌కుమార్, నివేదిత, జగదీశ్వర్ పాల్గొన్నారు.



శంకుస్థాపన శిలాఫలకం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

పెట్టుబడికి అధిక లాభాలిస్తామని వంచన

- రూ.6 కోట్లు వసూలుచేసిన ఇద్దరు అరెస్ట్

హైదరాబాద్ సిటీ: పెట్టిన పెట్టుబడికి అధిక లాభాలు ఆశచూపి రూ.6 కోట్ల వసూలు చేసిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను రాచకొండ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటకు చెందిన మాధవరం వంశీ కృష్ణారావు (35), కరీంనగర్ జిల్లా రామగుండం చెందిన తాటిపల్లి రాకేష్ (28) తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని భావించారు. తాము సూచించినట్లు పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. ఆసక్తి ఉన్నవారిని 'ఆర్ 7322 టీమ్ హార్వే' పేరుతో టెలిగ్రాం గ్రూపులో యాడ్ చేస్తున్నారు. ఆశావహులకు తొలుత కొంత లాభం వచ్చినట్లు చూపేవారు.

డబ్బు తమ ఖాతాల్లో వేయించుకొని యాప్‌లో పెట్టుబడి పెట్టినట్లు చూపేవారు. ఇలా పలువురిని మోసం చేసి సుమారు రూ.6.05 కోట్ల వరకు వసూలు చేశారు. లాభాలు వచ్చినట్లు యాప్‌లో చూపినా, డబ్బు విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడం..మోసగాళ్లు స్పందించకపోవడంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో వంశీకృష్ణారావు, రాకేష్‌లను అరెస్ట్ చేసి వారి ఖాతాల్లో రూ.22.64 లక్షలను ఫ్రీజ్ చేయించారు.

సైలెంట్ డీహైడ్రేషన్‌తో జాగ్రత్తగా ఉండాలి

పంజాగుట్ట, జూలై 25(ఆంధ్రజ్యోతి): సైలెంట్ డీహైడ్రేషన్‌తో జాగ్రత్తగా ఉండాలని గాంధీ మెడికల్ కాలేజీ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ సి.సురేష్ కుమార్, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎల్ శ్రీధర్ అన్నారు.ఇండియన్ మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా వర్క్‌షాప్‌లో వారు మాట్లాడుతూ తెలంగాణలో వేడి, తేమతో కూడిన వాతావరణం ఉంటుందన్నారు. దాహం కాకుండా గుర్తించదగిన సంకేతాలు, లక్షణాలు లేకుండా సైలెంట్ డీహైడ్రేషన్ సంభవిస్తుందన్నారు. శరీరం క్రమంగా ఫ్లూయిడ్, ఎలక్ట్రోలైట్లను కోల్పోతుందని, దీంతో శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుందని చెప్పారు. జ్వరం, వికారం, వాంతులు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, వేడి సంబంధిత అనారోగ్యాలతో సహా జ్వరం తదితర లేని పరిస్థితుల్లో కూడా డీహైడ్రేషన్ వస్తుందన్నారు. సైలెంట్ డీహైడ్రేషన్ తీవ్రమయ్యే వరకూ గుర్తించడం చాలా కష్టమన్నారు. ఎలక్ట్రోలైట్‌లను వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సూచించిన ఓఆర్ఎస్‌తో భర్తీ చేయవచ్చన్నారు. ద్రవాలు, ఎలక్ట్రోలైట్‌లను క్రమం తప్పకుండా తీసుకోవడం ఉత్తమమన్నారు.

కాస్మొటాలజీ సెంటర్లలో వైద్య మండలిసభ్యుల తనిఖీలు

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా సేవలు అందిస్తున్న స్కిన్, లేజర్, కాస్మొటాలజీ సెంటర్లపై తెలంగాణ వైద్య మండలి గురువారం తనిఖీలు నిర్వహించింది. అయిదు బృందాలుగా ఏర్పడి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి, మియాపూర్ ప్రాంతాల్లో మొత్తం 40 కేంద్రాల్లో తనిఖీ లు చేశారు. ఈ తనిఖీల్లో ముగ్గురు నకిలీ వైద్యులను గుర్తించారు. మరో 20 కేంద్రాల్లో చర్మ వ్యాధి నిపుణులు, ప్లాస్టిక్ సర్జన్స్ లేకుండా, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ అనుమతి లేకుండా లేజర్స్ వినియోగిస్తున్నారు. డెంటల్, ఆయుర్వేదిక్, హోమియోపతి వైద్యులకు నోటీసులు ఇస్తామన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు లేఖలు రాయనున్నామని టీజీఎంసీ ఛైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో వైస్‌ఛైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్, వైద్యులు ఆనంద్, విష్ణు, ఇమ్రాన్‌అలీ, సన్నీడేవిస్, విజయ్, ఫణి, రాజీవ్, మౌనిక పాల్గొన్నారు.


జీహెచ్ఎంసీలో వేధింపుల ఆఫీసర్ తొలగింపు

హైదరాబాద్ సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో లైంగిక వేధింపులకు పాల్పడిన జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ విభాగంలోని ప్రోగ్రామ్ ఆఫీసర్‌ను విధులను నుంచి తొలగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ విభాగంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సోమ భరత్ జీహెచ్ఎంసీలో ఓ మహిళా ఉద్యోగిని ప్రేమ పేరుతో వేధించాడు. విసుగు చెం దిన బాధితురాలు రెండు వారాల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి భరత్‌ను అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం కమిషనర్ ఆమ్రపాలి దృష్టికి రావడంతో మూడు రోజుల క్రితం భరత్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. సోమ భరత్ తీరు వల్ల ఆ విభాగంలో పనిచేసే దాదాపు 30మంది మహిళలు తమ ఉద్యోగాలు కోల్పోయినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

- ఇద్దరు యువకుల దుర్మరణం
- తీవ్రగాయాలపాలైన మరో ఇద్దరు యువకులు

దిల్‌సుఖ్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగం.. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వారి ప్రాణాల మీదకు తెచ్చింది. అర్ధరాత్రి సమయంలో అతివేగంగా దూసుకువచ్చిన కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో.. ఇన్నోవా కారులో ఉన్న ఇద్దరు యువకులు దుర్మరణం పాలవగా, మరో ఇద్దరు తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన మహ్మద్ అద్నన్(19) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మరో ఇద్దరు మిత్రులతో కలిసి ఇటీవలే ఓ ఇన్నోవా కారును కొనుగోలు చేశాడు. అయితే బుధవారం రాత్రి 11.45 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి కారు(ఎపి 09 బీఈ 0089) తీసుకుని మరో ముగ్గురు మిత్రులు సయ్యద్ సోఫియాన్(20), మహ్మద్ యాసిన్(20), మహ్మద్ మావియా(20)లతో కలిసి బయటకు వెళ్లాడు. అయితే 12.40 గంటల సమయంలో కర్మన్‌ఘాట్ నుంచి ఐఎస్ సదన్ వైపు వెళ్తుండగా చంపాపేట సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో కారులోపల ఉన్న నలుగురు తీవ్రగాయాలపాలయ్యారు. రోడ్డు ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించగా మహ్మద్ అద్నన్, సోఫియాన్‌లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కారు డ్రైవ్ చేస్తున్న యాసిర్, అబ్దుల్ మావియాలు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



సోఫియాన్ మృతదేహం



అద్నన్ మృతదేహం

వాణిజ్యాభివృద్ధికి ఏరోసిటీ చక్కటి వేదిక

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రీగస్ ఆఫీస్ ప్రారంభం

శంషాబాద్ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య అభివృద్ధికి జీఎంఆర్ ఏరోసిటీ చక్కటి వేదిక అని జీఎంఆర్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో అమన్‌కపూర్ అన్నారు. ఎయిర్‌పోర్టులో రీగస్ అధికారులతో కలిసి గురువారం వర్క్‌స్పేస్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచంలో వాణిజ్య రంగం అభివృద్ధి చెందడానికి అనువైన ప్రదేశాలు ఉండడం చాలా కీలకమని, అందులో జీఎంఆర్ ఏరోసిటీ ఒక్కటని చెప్పారు. దేశంలోని వివిధ వాణిజ్య రంగాలను అనుసంధానించేందుకు ఈ స్పేస్ ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు. ఐడబ్ల్యుజీ మేనేజర్ శ్రీహర్ష లాంబా తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో మరిన్ని సౌకర్యాలు

విమాన ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని జీఎంఆర్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రద్దీ సమయాల్లో చాలామంది ప్రయాణికులు యాప్ ఆధారిత క్యాబ్‌ల(ఓలా, ఉబెర్)ను సంప్రదిస్తారని, రాత్రివేళల్లో కొన్నిసార్లు క్యాబ్‌లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రయాణికులు తమకు నచ్చిన క్యాబ్‌లను ఎంచుకోవచ్చని, ఇప్పటికే క్యాబ్ ఆపరేటర్ల యజమానులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. క్యాబ్‌ల వల్ల ఏదైనా ఇబ్బంది కలిగితే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.



ఎంఓయూలో పాల్గొన్న ఇరువురు పారిశ్రామిక వేత్తలు

నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తే మహేంద్ర వర్సిటీ లక్ష్యం

- వైస్ చాన్సలర్ డాక్టర్ యాజూలు మేదూరి

దుండిగల్, జూలై, 25(ఆంధ్రజ్యోతి): నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని అభివృద్ధి చేయడమే లక్ష్యమని మహేంద్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజూలు మేదూరి అన్నారు. గురువారం బహదూర్‌పల్లిలోని మహేంద్ర యూనివర్సిటీ ప్రాంగణంలో మహేంద్ర యూనివర్సిటీ, నేషన్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ప్రీ ఇంజనీర్డ్ స్ట్రక్చర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఎస్ఐ) మధ్య అవగాహన ఒప్పందంపై(ఎంఓయూ) సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో నిర్మాణ ఇంజనీరింగ్ విద్యలో అత్యుత్తమ స్థాయిని సాధించడానికి ఈ ఒప్పందం కీలకమైన దశను సూచిస్తుందన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ జనరల్ టి.మధుసూధనరెడ్డి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ఆవిష్కరణలవైపు నడిపించగలదని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పీఎస్ఐ అధ్యక్షులు ప్రసాద్, తెలంగాణ ఛైర్మన్ శేఖర్‌రెడ్డి, ఎన్ఏసీ డైరెక్టర్ రాజిరెడ్డి, మహేంద్ర యూనివర్సిటీ అసిస్టెంట్ డీన్ విశాలాక్షి, మహేంద్ర యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగాల అధిపతి డాక్టర్ హరిప్రసాద్, విశ్వవిద్యాయలం స్కూల్ ఇన్నోవేషన్ డీన్ ప్రొఫెసర్ బీఏ చక్రవర్తి సీనియర్ ఫ్యాకల్టీ మురళీధర్, ఎండీ సత్యనారాయణ, ప్రొఫెసర్ కామేశ్వరరావు, పద్మజా గోకరాజ్, ఎండీలు రాజ్‌కుమార్, సురేష్, సెక్రటరీ రాంబాబు ఉన్నారు.

నారాయణ స్కూల్‌లో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

- రూ. 6.20 లక్షలు స్వాధీనం

వనస్థలిపురం : చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్ రాష్ట్రానికి చెందిన మిథిలేష్‌కుమార్(29) కొంత కాలంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లోగల నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గత నెల 12వ తేదీ రాత్రి స్కూల్‌లో బీరువాలో భద్రపరిచిన రూ.6,79,500 అపహరించి బిహార్ పారిపోయాడు. స్కూ ల్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి నిందితుడి ని బిహార్‌లో అదుపులోకి తీసుకున్నారు. రూ.6.20లక్షలు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్ తరలించారు. కేసును ఛేదించిన పోలీసులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కాశిరెడ్డి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఐ అశోక్‌కుమార్

పురుగు మందులను నిలువ చేసిన వ్యక్తి అరెస్టు

- పురుగు మందులు, సెల్‌ఫోన్ స్వాధీనం

కొత్తపేట: వివిధ కంపెనీల పురుగు మందులను అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిని ఎల్బీనగర్ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. 1659.606 లీటర్ల క్రిమిసంహారక ద్రావకం, 4770.84 కేజీల పురుగు మందులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అతడికి సహకరించిన నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. ఎస్‌హెచ్ఓ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. నిజామాబాద్ గుండారం గ్రామానికి చెందిన ఎలిగందుల రాజేష్(43) ఫర్టిలైజర్ వ్యాపారి. అతడు బైరామల్‌గూడ, సీతారాంనగర్‌కాలనీలోని ఓ అద్దె ఇంట్లో వివిధ కంపెనీల ట్రేడ్ మార్కులతో ఉన్న పురుగు మందులను అక్రమంగా నిల్వచేశాడు. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారి ఆకుల సకలేష్ సిబ్బందితో సదరు ఇంటిపై దాడిచేసి, లైసెన్స్ లేకుండా పురుగుల మందులను అక్రమంగా నిలువ చేశాడని గుర్తించారు. ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. రాజేష్ పలు కంపెనీల ట్రేడ్ మార్కులు వాడుకుంటూ వ్యవసాయదారులకు నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిసింది.

ఊడిపడిన ఇంటి స్లాబ్ పెచ్చులు : ఇద్దరికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ 6వ బ్లాక్‌లోని ప్లాట్ నంబర్ 20లో జ్యోతి కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటుంది. ఆమెతో పాటు ఇద్దరు కుమారులు అక్కడే ఉంటున్నారు. కాగా గురువారం తెల్లవారు జామున వారు నిద్రలో ఉండగానే ఇంటి స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. జ్యోతితో పాటు కుమారుడు వేణుపై పెచ్చులు పడడంతో స్వల్ప గాయాలకు గురయ్యారు. కొద్దిపాటి పెచ్చులు ఊడిపడడంతో పెను ప్రమాదం తప్పింది.